క్లుప్తంగా

రైతులంతా ఈకేవైసీ చేయించాలి

సీతానగరం: మండలంలోని రైతులు సాగు చేస్తున్న పంటల గణన, ఉత్పత్తిని గుర్తించడానికి వ్యవసాయశాఖ నిర్వహిస్తున్న ఈకేవైసీలో రైతులు సహకరించాలని ఏఓ ఎస్.అవినాష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఆదివారం మండలంలోని పెదభోగిలిలో వ్యవసాయశాఖ సహాయకులు చేస్తున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈకేవైసీ చేయాల్సిన గడువు ముగియనుండడంతో రైతులందరూ పొలాల్లో సాగు చేస్తున్న పంటపై ఈకేవైసీ విధిగా చేయించుకోవాలని స్పష్టం చేశారు.

రహదారి నిర్మాణానికి భూమిపూజ



రహదారి నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు వీరంనాయుడు, సర్పంచ్ వీరయ్య

పాచిపెంట: మండలంలోని పద్మాపురం పంచాయతీ బడ్నాయకవలస నుంచి పులిగుంటవలస వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాచిపెంట వీరంనాయుడు, సర్పంచ్ బడ్నాన వీరయ్య ఆదివారం భూమిపూజ చేశారు. సుమారు రెండు కోట్ల రూపాయల ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో రహదారి నిర్మించనున్నట్లు ఐటీడీఏ జేఈ సత్యనారాయణ తెలిపారు. అవసరమైన చోట సీసీ ర్యాంపులు, పైప్ కల్వర్టులు కూడా నిర్మిస్తామన్నారు.

జగనన్న, టిడ్కో ఇళ్లకు విద్యుత్ సరఫరా



కొత్తగా ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్

సాలూరు: పట్టణంలోని గుమడాం సమీపంలో గల జగనన్న కాలని, టిడ్కో ఇళ్ల సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ సబ్‌స్టేషన్ అందుబాటులోకి వచ్చింది. సుమారు 22 కోట్ల రుపాయలతో సబ్‌స్టేషన్ నిర్మించారు. దీన్నుంచి జగనన్న, టిడ్కో ఇళ్లకు విద్యుత్ సరఫరా అందిస్తున్నారు. దీంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

చురుగ్గా ప్రభుత్వ భవనాల నిర్మాణం



సచివాలయ శ్లాబ్ పనులను పరిశీలిస్తున్న పీఆర్ ఏఈ చంద్రమౌళి, ఇంజినీరింగ్ సహాయకులు

సీతానగరం: ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా నిధులు మంజూరు చేయడంతో సర్కారు కార్యాలయాలు, సీసీ రోడ్ల పనులు చురుగా జరుగుతున్నాయని మండల ఇంజినీరింగ్ అధికారి చంద్రమౌళి తెలిపారు. ఈ మేరకు మండలంలోని బూర్జలో రూ.43 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సచివాలయ భవనం శ్లాబ్ పనులను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.43 లక్షలతో సచివాలయ భవనం, రూ.22 లక్షలతో రైతుభరోసా కేంద్రం, రూ.21లక్షలతో వెల్‌నెస్ భవన నిర్మాణం జరుగుతున్నాయన్నారు. అలాగే జీజీఎంపీ నిధులు రూ 20 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సహాయకులు, సర్పంచ్ జి.దాసు, భవన నిర్వాహకులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

గరుగుబిల్లి: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు మండల కేంద్రంలోని డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాల/పాఠశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి పోలిశెట్టి ధనలక్ష్మి ఎంపికైయ్యారు. విజయనగరం రాజీవ్ క్రీడా మైదానంలో జిల్లా జట్టులను ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ధనలక్ష్మి ఎంపిక కావడంపట్ల ప్రిన్సిపాల్ సంధ్యారాణి, సిబ్బంది వెంకటరత్నం, భువన అభినందించారు.

యుద్ధప్రాతిపదికన సబ్‌స్టేషన్ ఏర్పాటు

పాలకొండ రూరల్: జగనన్న అర్బన్ కాలనీలో విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు యుద్ధప్రాతిపదికన చేపడుతున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ ఎస్.శ్యామ్ సుందర్ తెలిపారు. ఈ కాలనీలో దాదాపు 1300 గృహాలకు విద్యుత్ సరఫరా చేసేలా రూ.3.48 కోట్ల వ్యయంతో 33/11కేవీ సామర్థ్యంతో సబ్‌స్టేషన్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ జరుగుతున్న మట్టి, గ్రావెల్ ఫిల్లింగ్, ఫెన్సింగ్ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. త్వరలో పనులను పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

వాహన తనిఖీలు

రేగిడి: మండలంలోని మజ్జిరాముడుపేట, బూరాడ, చిన్నశిర్లాం జంక్షన్ వద్ద పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. ఎస్.ఐ.శ్రీనివాసరావు వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరూ వాహనంతో బయటకు వచ్చేటప్పుడు వాహనం ధ్రువపత్రాలు, లైసెన్స్ వెంట తీసుకురావాలన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహన నడపవద్దన్నారు.

ప్రజలకు వాస్తవాలు తెలియజేయండి..

● ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర



మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రజలకు వివరించి, వాస్తవాలు తెలియజేయాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. పట్టణంలోని తన స్వగృహంలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్లతో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతిపక్షాలు ప్రభుత్వంపై తప్పుడు విమర్శలు చేస్తూ, బురద చల్లే ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నాయని ఆరోపించారు. ఈ విషయంలో అందరం అప్రమత్తంగా ఉంటూ, వాటిని తిప్పికొట్టాలని సూచించారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా ముఖ్యమంత్రి పాలన సాగిస్తున్నారన్నారు. జిల్లాలో అత్యధిక నిధులు, అధిక అభివృద్ధి పనులు జరుగుతున్న నియోజకవర్గం సాలూరేనని చెప్పారు. ఈ వాస్తవాలన్నింటినీ ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ఎన్నికల ఫీవర్ ప్రారంభమైన నేపథ్యంలో అందరూ మరింత చురుగ్గా పనిచేయాలని తెలిపారు. రానున్న ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిను మరలా ముఖ్యమంత్రిని చేసేందుకు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు.

పంట పొలాల్లో కాలువల నిర్మాణం



కాలువ పనులు జరుగుతున్న దృశ్యం

సీతానగరం: వర్షాభావం కారణంగా మండలంలోని జోగింపేట పంటభూములకు సాగునీరు అందకపోవడంతో సాగునీటి కాలువల నిర్మాణాభివృద్ధికి గ్రామస్తుల సహకారంతో జేసీబీతో పనులు వేగవంతం చేస్తున్నట్లు సర్పంచ్ కె.సింహాచలం అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ జోగింపేటలో వర్షాధార భూములకు గుచ్చిమి చెరువు నుంచి సాగునీరు పంట పొలాలకు అందించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. వర్షాలు కురవకపోవడంతో పంట పొలాలు ఎండి పోతున్నాయని రైతులనుంచి ఆందోళన వ్యక్తం కావడంతో చెరువు నుంచి నీరు ప్రవహిస్తున్న కాలువల్లో పిచ్చిమొక్కలను తొగించి, పంట పొలాలకు సాగు నీరు అందించినంత వరకూ జేసీబీతో సిల్ట్ తీసే పనులు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సహాయకులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, ఆయకట్టు భూములున్న రైతులు పాల్గొన్నారు.

మూడో విడత రీసర్వే పనుల పూర్తికి సిద్ధం



మాట్లాడుతున్న తహసీల్దార్ ఎన్వీ రమణ

సీతానగరం: ప్రభుత్వం అమలు చేసిన జగనన్న భూ 'హక్కు', భూ 'రక్ష' పథకం ద్వారా జరుగుతున్న రీ సర్వే పనులు ఉన్నతాధికారుల సూచనల మేరకు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేశామని తహసీల్దార్ ఎన్వీ రమణ అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం చినభోగిలి, బూర్జ గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సెకెండ్ ఫేజ్‌లో జరుగుతున్న పనుల్లో భాగంగా 12 గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి స్టోన్ ప్లాంటేషన్ చేసినట్లు తెలిపారు. అలాగే 22ఎ ప్రభుత్వ భూములు, నిషేధిత రిజిస్టర్‌లో నమోదు చేయడం రెండు రోజుల్లో పూర్తవుతుందన్నారు. మూడోవిడత డీఎల్ఆర్ పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పటికే బుడ్డిపేట, చినభోగిలి గ్రామాల్లో గ్రౌండ్ ట్రూత్ పనులు పూర్తయ్యాయని, రైతులు రీసర్వే పనుల్లో పాల్గొనే వారికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ పి.చిట్టెమ్మ, ఆర్ఐ ఎస్.శ్రీనివాసరావు, మండలసర్వేయర్ గౌరీశంకరరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశానికి పయనం



రాష్ట్రస్థాయి విస్తృత సమావేశానికి తరలి వెళ్తున్న నాయకులు

పార్వతీపురం టౌన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలో నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్రస్థాయి విస్తృత సమావేశానికి పార్వతీపురం నియోజకస్థాయి పార్టీ నాయకులు ఎమ్మెల్యే జోగారావుతో కలిసి వెళ్లారు. నియోజకవర్గ సమస్యలు, పార్టీ బలోపేతానికి సంబంధించి సీఎం జగన్‌మోహన్ రెడ్డి ఈ సమావేశంలో దిశానిర్దేశం చేయనున్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే చర్యలు

● మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు



రామప్పలనాయుడు

పార్వతీపురం టౌన్: ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఆయన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే అపరాధ రుసుముతో పాటు చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారస్తులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. క్లీన్ పార్వతీపురంగా తీర్చిదిద్దేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వాదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినట్లు తెలిపారు. వ్యాపారస్తులు వాటిని విక్రయిస్తే జరిమానా విధించడంతో పాటు సరుకు స్వాధీనం చేసుకుంటామన్నారు. పలుమార్లు పట్టుబడినట్లయితే వారి లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

రూ.40 లక్షలతో రోడ్ల నిర్మాణం

కురుపాం: మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ పరిధిలో ఉన్న గిరిశిఖర గ్రామాలకు రూ.40 లక్షలతో రహదారుల నిర్మాణం చేపడుతున్నట్లు సర్పంచ్ అడ్డాకుల మన్మథరావు తెలిపారు. రోడ్డు నిర్మాణ పనులకు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి చొరవతో రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ నిధులతో పంచాయతీ పరిధిలోని దుంబుమానుగూడ నుంచి కంబమానుగూడకు, మాలిగాడిగూడ నుంచి తోటపాయిగూడకు, సిరికొండ నుంచి సాలిడంగుడ గూడకు, సంది గూడకు రహదారి నిర్మాణం చేపట్టనున్నట్లు చెప్పారు. దశాబ్దాలుగా రహదార్లకు నోచుకోని గిరిశిఖర గ్రామాలకు రోడ్లు నిర్మాణం జరుగుతుండడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

వాసవీ క్లబ్‌లు సేవా కార్యక్రమాలు చేయాలి



ఇంటర్నేషనల్ వాసవీక్లబ్ ఉపాధ్యక్షుడు రవికుమార్‌ను సత్కరిస్తున్న రీజనల్ క్లబ్ ప్రతినిధులు

సీతానగరం: ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఏర్పాటైన ఇంటర్నేషనల్ వాసవీక్లబ్ సభ్యులు సామాజికపరమైన సేవా కార్యక్రమాలు చేపట్టినప్పుడే గుర్తింపు వస్తుందని ఇంటర్నేషనల్ ఉపాధ్యక్షుడు ఎం.రవికుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం సీతానగరం మండల కేంద్రంలో వాసవీక్లబ్ రీజనల్ కోఆర్డినేటర్ ఎం.విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన రీజనల్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రవికుమార్ మాట్లాడుతూ సామాజిక పరమైన సేవలందించడానికి వాసవీ క్లబ్‌లు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. విశ్వేశ్వరరావు మాట్లాడుతూ రీజనల్ పరిధిలో 9 వాసవి క్లబ్‌లు పనిచేస్తున్నాయని చెప్పారు. ఇంటర్నేషనల్ క్లబ్ చైర్మన్ ఇచ్చిన సూచనల మేరకు క్యాలెండర్ ప్రకారం సేవాకార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. జోనల్ చైర్మన్ ఏవీ సత్యనారాయణ మాట్లాడుతూ ఈ ప్రాంతంలో ఆపదలో ఉన్న వారికి తమ క్లబ్ సభ్యుల సూచనల మేరకు వితరణ, సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం రీజనల్ వాసవీక్లబ్ ప్రతినిధులను విశ్వేశ్వరరావు దంపతులు శాలువాలు, జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో మండల వాసవీక్లబ్ అధ్యక్షుడు గోవిందరావు, ఉమాశంకర్‌రావు, కూర్మదాసు శ్రీనివాసరావు, లక్ష్మణరావు, గ్రంధి శ్రీనివాసరావు, వెంకటరాజు, సభ్యులు పాల్గొన్నారు.

కోతకు సిద్ధంగా వరిచేలు

● ఏర్పాటు కానున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలు



గాదెలవలసలో పక్వదశకు వచ్చిన వరిచేను

సీతానగరం: మండలంలోని పలుగ్రామాల్లో వరిచేలు కోతకు సిద్ధం కావడంతో పౌర సరఫరాలు, వ్యవసాయ శాఖాధికారులు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సమాయత్తమవుతున్నారు. 2023–24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి నీటి వనరులున్న గ్రామాల్లో వరినాట్లు, వర్షాధారం భూముల్లో యదల రూపంలో వెరసి 15,850 ఎకరాల్లో వరి పంటను రైతులు సాగు చేశారు. రైతుల కోరిక మేరకు నీటి ఎద్దడి తట్టుకునే విధంగా, నేలకు అనుకూలంగా, తెగుళ్లను తట్టుకునే ఎంటీయూ 1064, ఎంటీయూ 1161, బీపీటీ 3291, సాంబ మసూరి వరివిత్తనాలను వ్యవసాయ శాఖ సరఫరా చేయడం వల్ల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో వర్షాలు కురవడంతో వరినారు వేసిన 25 రోజులకే దమ్ముచేసి నాట్లు వేయడంతో పంటలు ఏపుగా పెరిగి, దిగుబడి ఆశాజనకంగా ఉందని చెబుతున్నారు. అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయనున్నామని, గోనె సంచులు అందజేస్తామని పౌరసరఫరాశాఖ హామీ ఇచ్చిన హామీని అమలు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఇబ్బందుల్లేకుండా ముందు జాగ్రత్తచర్యలు

మండలంలోని వివిధగ్రామాల్లో 2023–24 ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యగా అసలైన రైతులు ఈ పంటనమోదు, ఈ క్రాప్ బుకింగ్, ఈకేవైసీ చేయించుకోవాలని కోరడంతో ఇబ్బందులు కొంతమేరకు తొలగాయి.

సాగునీటి కోసం పాట్లు



గురండిలో వ్యవసాయ బోరు వద్ద నీటి తరలింపులో రైతులు

భామిని: ఖరీఫ్ వరిసాగు పొట్టదశకు చేరుకుంది. ఈ దశలో పంటకు నీటితడులు అందించినట్లయితే దిగుబడి బాగుంటుంది. అయితే గత కొన్నిరోజులుగా వర్షాలు లేక పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. వర్షాల కోసం ఎదురుచూసిన విసిగిపోయిన రైతులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టిసారించారు. వ్యవసాయ బోర్ల ద్వారా నీటిని పైపుల సాయంతో శివారు భూములకు తరలిస్తున్నారు. గురండి, బిల్లుమడ, బొమ్మిక, కాట్రగడ–బి, బత్తిలి ప్రాంతాల్లో వ్యవసాయ బోర్ల ద్వారా పంటకు నీటి తడులు అందిస్తున్నారు.

వాహనమిత్రతో ఆటోవాలాకు భరోసా



సీఎం జగన్ చిత్రపటానికి పాలభిషేకం చేస్తున్న ఆటో డ్రైవర్లు

వీరఘట్టం: వాహనమిత్ర పథకంతో సీఎం వైఎస్ జగన్‌మోహనరెడ్డి ఆటోవాలాలకు భరోసా కల్పించారని వీరఘట్టం శ్రీకోటదుర్గ ఆటోవర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు చుక్కా శ్రీనివాసరావు అన్నారు. స్థానిక అంబేడ్కర్ జంక్షన్ వద్ద ఆదివారం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి జై జగన్ అంటూ నినాదాలు చేశారు. గత నాలుగేళ్లగా వాహనమిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం చేస్తూ వందలాది మంది ఆటో కార్మికులకు జీవనోపాధి కల్పిస్తున్న సీఎం జగన్మోహనరెడ్డి సాయం మరువలేమన్నారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు గుడివాడ శంకరరావు, పాలకొండ ధర్మ, కె.దుర్గారావు, మామిడి శ్రీను, ఎస్.గంగరాజు, ఆర్.ఆనంద్, రాయిపల్లి దిలీప్, వైఎస్సార్‌సీపీ నాయకులు భోగి మణి, అంబళ్ల రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

భగవన్నామస్మరణతోనే మోక్షం

రేగిడి: భగవన్నామస్మరణతోనే మోక్షం కలుగుతుందని ఆధ్యాత్మిక వక్తలు జడ్డు జగ్గారావు, రామశేషు అన్నారు. స్థానిక దత్తపీఠంలో ఆధ్యాత్మిక గురువు కిమిడి సత్యంనాయుడు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక జ్ఞానబోధ సభ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగవంతుని నామాన్ని నిత్యం స్మరణ చేస్తూ ఉంటే పాపాలు పోతాయని, దుఃఖాలు దరిచేరవన్నారు. మనిషిని తరింపజేసేది తారకమంత్రమని, ప్రతిఒక్కరూ భగవంతుని నామాన్ని భక్తిశ్రద్ధలతో స్మరిస్తే ముక్తిని పొందవచ్చన్నారు.

పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలి

తెర్లాం: ప్రాథమిక స్థాయి నుంచే ప్రతీ విద్యార్థి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి సూచించారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తొలుత విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం పుస్తక పఠనం ద్వారా కలిగే లాభాలను వివరించారు. పుస్తకాలు చదవడం ద్వారా మంచి విజ్ఞానం అలవడుతుందన్నారు. పుస్తక పఠనంతో పాటు కథలు చెప్పడం, రాయడం నేర్చుకోవాలని, అలాగే చిత్రలేఖనంపై కూడా దృష్టి సారించాలని తెలిపారు.

అన్నదానం

రాజాం: మండలంలోని అంతకాపల్లి గ్రామం వద్ద వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మొగిలివలసకు చెందిన భక్తుల సహకారంతో ఈ కార్యక్రమం చేపట్టగా, చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు స్వామి అన్నప్రసాదం స్వీకరించారు.

పార్టీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి



జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న పార్టీ మండల అధ్యక్షుడు లక్షణ్‌నాయుడు

రామభద్రపురం: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సూచించారు. విజయనగరంలో పార్టీ రామభద్రపురం మండల అధ్యక్షుడు అప్పికొండ లక్షణ్‌నాయుడు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావును ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు పార్టీ మండల అధ్యక్ష పదవి రావడానికి కృషి చేసిన జెడ్పీ చైర్మన్‌ను శాలువాతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ మండలంలో పార్టీ మరింత బలోపేతానికి కృషి చేయాలన్నారు. పార్టీ అధిష్ఠానం అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ప్రతినిధి అప్పికొండ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గణేశుని నిమజ్జనోత్సవం



వీధుల్లో వినాయకుని ఊరేగింపు



తప్పెటగుళ్ల కళాకారుల ప్రదర్శన



ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన కాళికామాత బొమ్మ

రామభద్రపురం: మండల కేంద్రంలోని కనిమెరక వీధిలోని గణేశుని నిమజ్జనోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. 21 రోజుల పాటు పూజలందుకున్న వినాయకుడికి ఉదయం ప్రత్యేక పూజలు చేసి, సాయంత్రం విగ్రహాన్ని వీధుల్లో ఊరేగించారు. అనంతరం దగ్గరలోని నదీతీరానికి తీసుకువెళ్లి, నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ప్రధానంగా తప్పెటగుళ్ల ప్రదర్శన, బిందెల డ్యాన్సు, కోలాటం, యువతీ, యువకుల నృత్యాలు, కోయ డ్యాన్సు, కాళికామాత బొమ్మల ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

వర్షాలు కురవాలని కప్పలకు పెళ్లి



కప్పలకు పెళ్లిచేసి కావిడిలో ఊరేగిస్తున్న గ్రామస్తులు



కొండపైన పూజలు చేస్తున్న నులకజోడు గ్రామస్తులు

భామిని: వరుణ దేవా..కరుణించవా.. అంటూ మండలంలోని నులకజోడులో రైతులు ప్రార్థనలు చేశారు. వర్షాలు కురవాలని కోరుకుంటూ కొండదేవతకు వరద పాయసం పెట్టారు. కప్పలకు పెళ్లి చేసి కావిడలో ఉంచి మేళతాళాలతో ఊరేగించారు. తివ్వకొండ మెట్టపైకి తీసుకువెళ్లి మొక్కులు తీర్చారు. వరద పాయసం పోసి పూజలు చేశారు. గ్రామానికి చెందిన రైతులంతా ఊరేగింపులో పాల్గొన్నారు.

టెండర్ ప్రక్రియ వాయిదా

సీతంపేట: గిరిజన గురుకులాలు, మినీగురుకులాలు, కళాశాలలు, వసతిగృహాలకు కూరగాయలు, పండ్లు, చికెన్ సరఫరా చేయడానికి ఈనెల 9న నిర్వహించాల్సిన టెండర్లను వాయిదా వేసినట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనా కుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు టెండర్ల ప్రక్రియ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. టెండర్‌దారులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు 11న ఇంటర్వ్యూ

గుమ్మలక్ష్మీపురం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెమిస్ట్రీ గెస్ట్ అధ్యాపకులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పీజీలో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు అర్హులుగా పేర్కొన్నారు. సెట్, స్లెట్, పీహెచ్‌డీ ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలతో ఈ నెల 11న ఉదయం 11 గంటలకు కళాశాలలో నిర్వహించే ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. అభ్యర్థులు తరగతి గదిలో డెమో ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు.